# ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రతిపాదనను విరమించాలి






### విద్యాసంస్థల బంద్ విజయవంతం చేసిన వామపక్ష విద్యార్థి సంఘాలు

**ఆలేరు, జూలై 10 :**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 27 వేల నుంచి 4 వేలకే పరిమితం చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఆలేరు మండల కేంద్రంలోని పలు విద్యాసంస్థల వద్ద నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల నరేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం. ఉదయ్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మధు లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విలీనం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని కోరారు. అక్షయపాత్ర వంటి సంస్థలకు కాకుండా మహిళా సంఘాల ద్వారానే మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని వారు కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు, లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, జీవో నంబర్లు 7, 8, 9లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని, ప్రతి విద్యాసంస్థలో కంప్యూటర్ ల్యాబ్‌లు, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్, మరుగుదొడ్లు, వంట షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులను చెల్లించాలని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధక, డ్రగ్స్ నిరోధక, ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులు, ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్‌ను బలవంతంగా విక్రయించే విధానాన్ని నిలిపివేయాలని, నూతన విద్యా విధానం–2020ను తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం. ఉదయ్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మధు, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు మద్దెల సాయి గణేష్, సభ్యులు బి. కుమార్, మామిడాల మహేష్, ప్రణయ్, తమ్మడి చరణ్, దార చందు, లవన్, బన్నీ, కిరణ్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కోహెడలో రూ.47.03 కోట్లతో ఎగుమతి ఆధారిత చేపల మార్కెట్‌కు శంకుస్థాపన

### మంత్రి వాకిటి శ్రీహరి

**కోహెడ, జూలై 10 :**

రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మత్స్యకారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎలాంటి అడ్డంకులనైనా ఎదుర్కొంటానని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతో నిర్మిస్తున్న ఈ కేంద్రం దేశంలోనే సముద్రతీర ప్రాంతం కాకుండా అంతర్గత రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న తొలి అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతి కేంద్రంగా నిలవనుంది. ఆధునిక కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, శుద్ధి యూనిట్లు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటు



చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా సుమారు 2 వేల మంది వ్యాపారులకు అవకాశం లభించడంతో పాటు 5 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కలగనుంది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే చేపలకు అంతర్జాతీయ మార్కెట్లు అందుబాటులోకి వచ్చి మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని ప్రభుత్వం పేర్కొంది.

# హుస్నాబాద్‌లో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్..

### జిల్లాలో 50 వేల ఎకరాలే లక్ష్యం: మంత్రులు

**సిద్దిపేట, జూలై 10 :**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతు సంపత్‌ను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడమే లక్ష్యమని, ప్రస్తుతం 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందన్నారు. ఆయిల్ పామ్‌కు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ ఉత్పత్తి



తక్కువగా ఉందని, రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపాలని కోరారు. ఎకరానికి రూ.50 వేల వరకు సబ్సిడీ, రైతు భరోసా, నాలుగేళ్ల పాటు అంతర పంటల సాగు అవకాశంతో పాటు కోతుల బెడద, వర్షాభావ ప్రభావం తక్కువగా ఉంటాయని తెలిపారు. 100 ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాలకు రూ.5 లక్షలు, 200 ఎకరాలకు మించి సాగు చేసిన గ్రామాలకు రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఆయిల్ పామ్ దేశ అవసరంగా మారిందని, దిగుమతులపై ఆధారపడకుండా దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్లు ఓపిక పడితే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు. హుస్నాబాద్ సమీపంలోనే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉండటం రైతులకు అదనపు ప్రయోజనమని పేర్కొన్నారు. 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన రూ.5 లక్షలతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తాను కూడా మరో రూ.5 లక్షల ప్రోత్సాహకం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ మత్స్యకారుల దినోత్సవం

### కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న గంగపుత్రులు

**మంచిర్యాల, జూలై 10 :**

జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పునస్కరించుకొని జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో శుక్రవారం గంగాపుత్ర సంఘం నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు నేన్నెల నరసయ్య, పట్టణ అధ్యక్షులు గుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశానికి స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న మత్స్యకారుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, విద్యా,



ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో అత్యంత వెనుకబడిన కులం గంగపుత్రులదే అని అన్నారు. దేశాన్ని అత్యధిక సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ గంగపుత్రులకు ఒరగబెట్టింది ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లలకు బదులుగా, నగదు బదిలీ చేయాలని, గత 12 సంవత్సరాల నుండి మరణించిన 986 మందికి ఎక్స్ గ్రేషియా తక్షణమే చెల్లించాలని అర్హులైన మత్స్యకారులు అందరికీ టూవీలర్లు, ఫోర్ వీలర్ వాహనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని తెలిపారు. మత్స్యకార సొసైటీ సభ్యులందరికీ జీవిత భద్రత కల్పించేలా 20 లక్షల ఇన్సూరెన్స్ ఎక్స్ గ్రేషియా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగాపుత్ర సంఘం పట్టణ యూత్ అధ్యక్షులు మంచెర్ల సదానందం, శాఖపురం భీమ్సేన్, గగ్గూరి రాజన్న, మనోహర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి:

### ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్




**ఆలేరు, జూలై 10 :**

ఇంటర్మీడియట్ వృత్తి విద్య (ఒకేషనల్) కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 14వ తేదీన నల్లగొండ పట్టణంలోని కేపీఎం వొకేషనల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ వృత్తి విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాల్గొనే అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాల అసలు, జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటా (రిజ్యూమ్)తో పాటు నిర్ణీత సమయానికి హాజరు కావాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ప్రతిభ ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న వృత్తి విద్యార్థులకు ఈ జాబ్ మేళా మంచి అవకాశమని, ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరై తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం: కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, జూలై 10**



పెద్దపల్లి జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టాస్క్ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణ, ప్లేస్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. డిగ్రీ, బీటెక్, డిప్లొమా, పీజీ పూర్తి చేసిన లేదా చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంఎస్ ఎక్సెల్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్ బీఐ, పైథాన్, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ అందించి, విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ప్లేస్‌మెంట్ సహాయం అందిస్తారు. శిక్షణ ఉచితం కాగా, రిజిస్ట్రేషన్‌కు ఒక్కసారి మాత్రమే రూ.600 చెల్లించాలి. కేవలం 100 సీట్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో ఆసక్తి గల అభ్యర్థులు జూలై 15లోపు టాస్క్ ప్రాంతీయ కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9059506807ను సంప్రదించాలని కోరారు.

## ఆలేరులో డీవైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

### నూతనంగా ఎన్నికల అధ్యక్షుడు కార్యదర్శి

**ఆలేరు, జూలై 10 :**



డీవైఎఫ్ఐ ఆలేరు పట్టణ మూడో మహాసభలో నూతన పట్టణ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా యాసారపు ప్రసాద్, కార్యదర్శిగా మొరిగాడి పృథ్వీరాజ్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కాసుల నరేష్, ఎర్ర నాగరాజ్, సహాయ కార్యదర్శిగా వడ్డేమాన్ విప్లవ్ కుమార్, కోశాధికారిగా ఎక్కలదేవి భాస్కర్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా మొరుగాడి మావిర్, రేగోటి ప్రశాంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు చెన్న రాజేష్ మాట్లాడుతూ యువజన సమస్యల పరిష్కారం, నిరుద్యోగంపై పోరాటాలు, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలపై యువతను చైతన్యపరుస్తూ సమాజ నిర్మాణానికి కమిటీ కృషి చేయాలని కోరారు.

## గ్రామీణ రహదారులకు ప్రత్యేక కోడింగ్ వ్యవస్థపై ప్రజాభిప్రాయ సేకరణ

**న్యూఢిల్లీ, జూలై 10**

దేశంలోని ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులకు ప్రత్యేక పేరు, కోడ్, డిజిటల్ గుర్తింపు కల్పించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఇంట్రా–విలేజ్ రోడ్ కోడింగ్ అండ్ గ్రేడింగ్ సిస్టమ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగుతోంది. గ్రామాల్లోని అంతర్గత రహదారులు ఇప్పటివరకు సమగ్రంగా నమోదు కాకపోవడంతో అంబులెన్స్‌లు, అగ్నిమాపక, పోలీస్, పోస్టల్, కొరియర్ సేవలు సరైన చిరునామాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కేంద్రం పేర్కొంది. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రతి రహదారికి ప్రత్యేక కోడ్, స్పష్టమైన సూచిక బోర్డు, డిజిపిన్, గ్రామ మాంచిత్రతో అనుసంధానం చేయాలని ప్రతిపాదించింది. ప్రతి ఇంటి నంబరును రహదారి కోడ్‌తో అనుసంధానం చేయడం, స్థానిక భాషతో పాటు ఇంగ్లీష్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, క్యూఆర్ కోడ్ ద్వారా రహదారి వివరాలు అందుబాటులోకి తేవడం వంటి సూచనలు వెలువడుతున్నాయి. గ్రామ యువత, ప్రజాప్రతినిధులు, పోస్టల్ సిబ్బంది, ఆశా కార్యకర్తల సహకారంతో క్షేత్రస్థాయి ధృవీకరణ చేపట్టి, కొత్త రహదారులు, కాలనీలు, ఇంటి నంబర్ల వివరాలను గ్రామపంచాయతీలు ఎప్పటికప్పుడు నవీకరించాలని ప్రజలు సూచిస్తున్నారు. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే అత్యవసర సేవలు, గ్రామీణ పరిపాలన, డిజిటల్ మ్యాపింగ్, మౌలిక వసతుల ప్రణాళిక, ఈ–కామర్స్ సేవలు మరింత సమర్థవంతంగా మారే అవకాశం ఉంది.

చురకలు



# జనగణనలో కులగణన – మళ్లీ మోసపోతున్న బీసీలు

**ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలి**



**హైదరాబాద్, జూలై 10:**

బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం మరియు బీసీ పొలిటికల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో "జనగణనలో కులగణన – మళ్లీ మోసపోతున్న బీసీలు" అనే అంశంపై పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జనగణన మొదటి దశ (Phase–I)లో హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ పూర్తయిందని, ప్రస్తుతం రెండో దశ (Phase–II) జనాభా గణనకు సంబంధించిన ప్రశ్నావళిపై 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జూలై 6 నుంచి జూలై 18 వరకు ప్రీ–టెస్టింగ్ జరుగుతోందని తెలిపారు. ఈ ప్రీ–టెస్టింగ్ ప్రశ్నావళిలో ఎస్సీ, ఎస్టీలకు ముందుగానే కేటాయించిన యూనిక్ కోడ్ల ఆధారంగా వివరాలు నమోదు చేస్తున్నప్పటికీ, మిగతా కులాల విషయంలో "ఓపెన్–ఎండెడ్" విధానాన్ని అనుసరిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఏ పేరుతో తమ కులాన్ని చెబితే అదే నమోదు చేయడం వల్ల ఒకే కులం వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో నమోదై డూప్లికేషన్, మల్టిప్లికేషన్ ఏర్పడి, కులగణన విశ్వసనీయత దెబ్బతింటుందని చెప్పారు. 2011లో నిర్వహించిన సామాజిక–ఆర్థిక కుల గణన (SECC)లో యూనిక్ కోడ్‌లు లేకపోవడం వల్ల దేశవ్యాప్తంగా 42 లక్షల కులాల పేర్లు నమోదయ్యాయని, 2014 తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వేలో కూడా ఇదే సమస్య తలెత్తిందని గుర్తు చేశారు. అయితే 2024 తెలంగాణ సామాజిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో ప్రతి కులానికి కోడ్ నంబర్లు కేటాయించడం వల్ల కులాల వివరాలు శాస్త్రీయంగా నమోదు చేయడం సాధ్యమైందని పేర్కొన్నారు. బీహార్ కులగణనలో కూడా కోడ్ వ్యవస్థను అమలు చేశారని తెలిపారు. కాబట్టి దేశవ్యాప్తంగా ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ ఐడెంటిఫికేషన్ కోడ్ కేటాయించి, అదే ఆధారంగా జనగణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఈ కులగణన కూడా 2011 తరహాలో ప్రయోజనం లేకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే, 2011 జనగణనలో ఉన్న 29 ప్రశ్నల షెడ్యూల్‌ను యథాతథంగా కొనసాగించకుండా, సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులను సమగ్రంగా ప్రతిబింబించేలా కొత్త ప్రశ్నలను చేర్చి షెడ్యూల్‌ను సవరించాలని కోరారు. తుది ప్రశ్నావళిని ఖరారు చేసే ముందు ప్రజా సంఘాలు, నిపుణులు, బీసీ సంస్థలతో విస్తృత ప్రజా సంప్రదింపులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భముగా ప్రధాన మంత్రి కి వ్రాసిన లేఖ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా బీఎస్పీ కన్వీనర్ పూర్ణ చందర్ రావు ఐపీఎస్ retd,మాజీ డీజీపీ మాట్లాడుతూ, ప్రభుత్వాలు బీసీలను దశాబ్దాలుగా మోసం చేస్తూ వస్తున్నారని, ప్రస్తుత కులగణన విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదని విమర్శించారు. కులగణనను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు మాట్లాడుతూ, బీజేపీ బీసీ ఎంపీలు, వెంటనే స్పందించి రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తాలని కోరారు. ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించేలా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ, కులగణన శాస్త్రీయంగా, వృత్తిపరమైన ప్రమాణాలతో జరగాలంటే యూనిక్ కోడ్ వ్యవస్థ తప్పనిసరి అని అన్నారు. ఈ సమావేశానికి దుర్గయ్య గౌడ్ అధ్యక్షత వహించగా, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్ గౌడ్, ఎర్రమాద వెంకన్న, చెన్న శ్రీకాంత్ ,సింగం నాగేశ్వర్ గౌడ్,కొండల్ గౌడ్,లింగేశ్ యాదవ్, జెల్ల నరేందర్,భిక్ష పతి , మరియు నాగభూషణంతదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు పిఏసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- **రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**




**ఆలేరు, జూలై 10 :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పాక్స్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరై నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన జనగాం ఉపేందర్ రెడ్డితో పాటు నూతన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ రైతాంగానికి సహకార సంఘాలు వెన్నెముకగా నిలుస్తున్నాయని, రైతులకు అందే సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ, ధాన్యం కొనుగోలు, రైతు సేవా కార్యక్రమాలను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించాలని అన్నారు. రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి సభ్యుడు నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో సహకార సంఘాల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వేగంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రధాన బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సహకార శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, PACS సభ్యులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమం అనంతరం నూతన పాలకవర్గ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జ్ఞాపక చిత్రాలు దిగారు.

## నిర్ణీత గడువులోగా ఎస్ ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

**భారత ఉప ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ**




**హైదరాబాద్, జూలై 10**

రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జీహెచ్ ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని, ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్ గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాల విధానాలను ఇతర జిల్లాలు కూడా అమలు చేసి, రోజువారీ లక్ష్యాల మేరకు ఎస్ ఐఆర్–2026 ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

# విప్లవ సాంస్కృతిక యోధుడు నాగన్నకు నివాళి

- **నేడు సంతాప సభ**
- **అరుణోదయ జిల్లా కార్యవర్గం పిలుపు.. భారీగా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి**



**ఆలేరు, జులై 10 :**

ప్రజా సాంస్కృతికోద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన విప్లవ సాంస్కృతిక యోధుడు నాగన్నకు నివాళిగా అరుణోదయ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో నేడు సంతాప సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఎలగందుల సిద్ధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, యువజనులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. నాగన్న తన ప్రజా గీతాల ద్వారా ప్రజల సమస్యలను సమాజం ముందుకు తీసుకువచ్చి, అణగారిన వర్గాల పక్షాన నిలబడి ప్రజా చైతన్యాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. నేటి సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో ప్రజా సాంస్కృతిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, నాగన్న చూపిన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సంతాప సభలో నాగన్న జీవితం, ఉద్యమ ప్రస్థానం, ప్రజా సాంస్కృతిక రంగానికి ఆయన చేసిన సేవలపై పలువురు ప్రముఖులు ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాకాల నరేష్, పాకాల సరిత, మామిడాల ప్రవీణ్, కల్లెపు ప్రణయ్, ఇక్కిరి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తాం: డా. పట్నం మహేందర్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 10 :**

ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బషీరాబాద్ మండలానికి చెందిన మజీద్ కమిటీ ప్రతినిధులు కలిసి ఖబ్రస్తాన్ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో ఖబ్రస్తాన్ ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు విడుదల చేసిన విషయాన్ని కమిటీ సభ్యులు గుర్తు చేశారు. అనంతరం పనులు నిలిచిపోయాయని, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన డా. పట్నం మహేందర్ రెడ్డి, రానున్న రోజుల్లో నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు రజాక్, నాయకులు జహూరుద్దీన్, బేకరీ సర్దార్, అఫీజ్ బిలాల్, ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## కుల్కచర్ల లో మార్కెట్ యార్డ్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ

**పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్.టి. రామ్మోహన్ రెడ్డి**



**కుల్కచర్ల మండలం, జులై,10**

వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో రూ.50 లక్షలతో మార్కెట్ యార్డ్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి కుల్కచర్ల మండల కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మార్కెట్ యార్డ్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులతో కలిసి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (SIR) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి భూమి పూజ నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, మార్కెట్ యార్డ్ కార్యాలయ భవనం నిర్మాణంతో రైతులు, వ్యాపారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



**మహబూబ్ నగర్ జూలై 10**

ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు ర్యాలీని ప్రారంభించి, కుటుంబ నియంత్రణ, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. జూలై 13న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో 1–19 ఏళ్ల పిల్లలకు వయస్సు ప్రకారం ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని, అంగన్‌వాడీలు, పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి మాత్ర వేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ అమలు చేయాలి

**మిస్డ్ కాల్ అభియాన్, సంతకాల సేకరణ నిర్వహించిన మహిళా కాంగ్రెస్**



**ఆలేరు, జులై 10 :**

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ డిమాండ్ చేశారు. ఆలేరులోని ఇందిరా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్ అమలు కోరుతూ మిస్డ్ కాల్ అభియాన్, పోస్ట్‌కార్డులపై సంతకాల సేకరణ చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీకి పంపేందుకు సిద్ధం చేశారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచనల మేరకు జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామ స్థాయి మహిళా కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర కార్యదర్శి మౌనిక, జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల కవిత, పరంజ్యోతి, పి. పావని, దీప, సిద్ధి లక్ష్మి , సంగీత, మాధవి, పట్టణ అధ్యక్షురాలు కవిత, దూడల అనితతో పాటు మండల, గ్రామ కమిటీ ప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## వేములవాడలో నక్ష సర్వేను పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేముల వాడ జూలై 10**

వేములవాడ పట్టణంలో కొనసాగుతున్న నక్ష సర్వేను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ యంత్రంతో ఇంటి కొలతలు నమోదు చేసే విధానాన్ని పరిశీలించిన ఆమె, ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. నక్ష సర్వేతో ప్రతి ఇంటి విస్తీర్ణం పక్కాగా నమోదవుతుందని, మున్సిపల్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సమన్వయంతో సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. త్వరలోనే వేములవాడ పట్టణానికి సంబంధించిన నక్ష సిద్ధమవుతుందని కలెక్టర్ తెలిపారు.

